

దివాను జగన్నాథరాజుగారు తన యెదుట నున్న కాగితాలను చూసుకుంటూనే, ఎదుట కొంచెం దూరంలో చేతులుకట్టుకుని నించునివున్న దరఖాస్తుదారుని మనవిని వింటూవున్నారు.

'మహాప్రభువులు కరుణించాలి! చాలా బీద బ్రాహ్మడిని. పెద్ద కుటుంబం. ఏ ఆధారమూ లేదండి, ప్రభువుల అనుగ్రహం తప్ప! ఏదన్నా వుద్యోగం యిప్పించి, యీ కుటుంబాన్ని పోషించాలని ప్రార్థన.'

అని ఎదుట నించునివున్న సోమనాథం వినయ విధేయతలతో మనవి చేశాడు.

దివాను సోమనాథంవైపు దృష్టిమరల్చి 'ఏమయినా ఖాళీలుంటే నువ్వింత బతిమాల నక్కర్లేదయ్యా! మా సంస్థానం పనీ జరగవలసిందేగా! అయితే నేమీ? ఇప్పుడేమిన్ని ఖాళీలు లేవు' అని అన్నాడు.

సోమనాథం చేతులు నులుపుకుంటూ 'చిత్తం, చిత్తం! ప్రభువులు తలుచుకుంటే ఏ ఖాళీఅన్నా వస్తుంది. ఈ బీద కుటుంబం వొక్కటి పోషించడం ప్రభువులకి ఒక లెక్కలోది కాదు' అన్నాడు.

దివాను నిదానించి చూస్తూ 'నీ గోడు నువ్వు చెప్పడం సబబుగానే వుంది. కాని నేను తలుచుకుంటే యే ఖాళీ అయినా వస్తుందనడం సరిగాలేదు. నీకు ఖాళీ కావాలంటే ఎవర్నయినా బర్తరఫు చెయ్యాలన్నమాట! నీలాంటి బీదవాడి కుటుంబం పొట్టమీద కొట్టాలన్నమాటకదూ! విజయనగరం సంస్థానంలో అలాంటిపని యెన్నటికిన్నీ జరగదు.' అన్నాడు.

సోమనాథం గడగడలాడిపోయాడు.

'చిత్తం, చిత్తం! మరొకరిని బర్తరఫు చేసి, ఆ పని నాకిప్పించాలని నేను కోరలేదు ప్రభూ! సర్వేజనా స్సుఖినోభవంతు! ధర్మ సంస్థానం అయిన ప్రభువుల సంస్థానంలో అలాంటిపని యెన్నటికిన్నీ జరగదని తెలుసును ప్రభూ! తమరు తలిస్తే ఏదో ఒక పని కల్పించగలరనీ, ధర్మసంస్థానం - ఒక బీద కుటుంబం మలమల మాడిపోతూ వుంటే చూస్తూ ఊరుకోదనీ ధైర్యంతో అలా అన్నాను ప్రభూ!'

జగన్నాథరాజుగారు కొంచెం ఆలోచనలో పడ్డారు.

'ప్రస్తుతం యేమీ ఖాయంగావుండే నౌకరీలు లేవు. అయినా, ఆలోచిస్తాం! నువ్వు ఏమి చేయగలవో చెప్పు.'

'చిత్తం, చిత్తం. నేను కొంతకాలం వక కోమటి గుమాస్తాగా పనిచేశాను. చిఠా ఆవర్జాలు బాగా వ్రాయగలను. ఎలాంటి లెక్కనయినా సులభంగా చేస్తాను. తికమకల్లోవున్న లెక్కలను శీఘ్రంగా చిక్కువిడదీయగలను. ఆ కోమటి, తన కుమారుడికి తరిఫీదు ఇమ్మని చెప్పి, వాడు అన్నీ బాగా గ్రహించాక నాకు ఉన్నపాటున ఉద్వాసన చెప్పాడండి!'

'ఏవయినా ఇళ్లు కట్టించే అనుభవం వుందా? ఏ పనివాళ్లకి ఎంత యిస్తే గిట్టుబడి అవుతుందో - పని లోటూ, లొసుగూ లేకుండా జరుగుతుందో తెలుసా?'

'చిత్తం, చిత్తం. బాగా తెలుసునండి. మా సెట్టిగారు కట్టించిన భవంతిపని నా చేతిమీదుగానే జరిగిందండి! అదా, పైసలుతోకూడా లెక్కలు సమంగా అప్పగించేవాడిని. ఆయన చాలా సంతోషించి వక పట్టుశాలీ పంచెలచాపు బహుమానంగా యిచ్చారండి. పని పసందుగా వుందంటూ కితాబు యిచ్చారండి.'

"సరే! యిప్పుడు సంస్థానంవారు భీముని పట్నంలో సముద్రపువొడ్డుని ఒక పెద్ద బంగళా కట్టించదలచుకుని వున్నారు. ఆ పని చేయించే పూచీ పడితే నీకు అప్పగిస్తాను. కావలసిన వస్తువులూ, కలపా మొదలయినవి తగిన ఖరీదుకి సులభంగా సప్లయి అయేటట్లు మేం తాఖీదులు యిస్తాం. ఆరు నెలలు దాటకుండా బంగళా పసందుగా

తయారు కావాలి."

"చిత్తం, చిత్తం. తప్పకుండా తమ ఆజ్ఞ నెరవేరుస్తానండి. ప్రభువులు మెచ్చుకునేటట్లు చేయిస్తాను."

"నువ్వు ఆరునెలలపాటు ఆ పనిని చూడవలసిఉంటుంది. అహోరాత్రాలు దానిమీదనే కన్ను ఉంచాలి. ఏభయి వేలు దాటకుండా అయేటట్లు చూడాలి. ఇది నీకు నచ్చినట్లయితే రేపట్నుంచే పని ప్రారంభించవచ్చు"

"చిత్తం, చిత్తం. ప్రభువుల ఆజ్ఞకి వ్యతిరేకంగా చెప్పడానికి ఎవరికి సాధ్యమండి: ఏలినవారికి ఎలా తోస్తే అలా ఆజ్ఞాపించవచ్చు."

"సరే! సాయంకాలం కనపడు; అక్కడి రాణేదారుకి తాఖీదు వ్రాయించి ఉంచుతాము. నువ్వు అడిగినప్పుడల్లా అవసరమైనంత సొమ్ము అతను నీకు ఇస్తూవుంటాడు. అక్కడి నౌకర్లు కూడా నీకు సహాయంగా ఉండేటట్టు ఏర్పాటు చేయిస్తాము."

2

భీమునిపట్నంలో విజయనగరం మహారాజావారి బంగళాపని సోమనాథం యాజమాన్యంకింద చాలా చురుకుగా జరుగుతున్నది.

సోమన్న – అంటే – సోమనాథం తన కుటుంబంతోకూడా భీమునిపట్నంవచ్చి ఒక చిన్న యిల్లు అద్దెకు నిర్ణయించుకుని కాపురం పెట్టాడు.

రామారమి రెండు నెలలు గడచాయి.

సోమన్న చాలా శ్రద్ధగా పని చేయిస్తున్నాడు.

దివానుగారి ఆజ్ఞప్రకారం అతను పనికి కుదురుకున్నాడు; కాని ఈ పనివల్ల తనకెటువంటి లాభమో అతినికి తెలియదు. ఇంత జీతం యిస్తామని దివానుగారూ సెలవివ్వలేదు; ఇంత ఇయ్యాలంటూ సోమన్నా అడగలేదు.

రెండు నెలలు కావచ్చినా ఒక నెల జీతమయినా అందక చాలా ఇబ్బంది పడుతున్నది ఆ బీదకుటుంబం! బంగళా పని నిమిత్తం సోమన్న చేతిలో వేలకొద్దీ డబ్బు ఆడుతూవుండేది. కాని అందులోంచి ఒక దమ్మిడీకూడా అతను ముట్టడు. అలా తీసికోవడం ద్రోహం చేసినట్లని అతని భావన.

రెండు నెలల జీతమూ ఒక్కసారిగా వస్తుందనీ, ఆ విషయమై దివానుగారికి యాదాస్తు పంపడం మర్యాద కాదనీ సోమన్న అనుకున్నాడు. కుటుంబ అవసరాలకోసం చిల్లరఅప్పులు చెయ్యవలసి వచ్చింది.

రోజులపైని రోజులూ, వారాలమీద వారాలూ, నెలలమీద నెలలూ గడిచిపోతున్నాయి. బంగళా పని చాలా చురుకుగానే



జరిగిపోతున్నాది. కాని సోమన్నకుమాత్రం జీతంలో వకదమ్మిడీ కూడా అందలేదు.

అతను మనస్సులో చాలా కష్టపడ్డాడు. అయినా ఎవ్వరితోటీ యీసంగతి చెప్పడం లేదు. బంగళా పూర్తిఅయాక మొత్తమ్మీద సొమ్మంతా ఒక్కసారిగా ఇవ్వవచ్చని అనుకున్నాడు.

నిత్యఖర్చులకోసం అతను తన దర్భముడి ఉంగరాన్నే కాకుండా, భార్య మెడలోని మంగళసూత్రాలదగ్గరనుంచి అమ్మవలసివచ్చింది. ఆ యిల్లాలు పసుపుకొమ్ము మెడలో కట్టుకోవలసి వచ్చింది.

3

బంగళా పసందుగా తయారయింది.

ఈ సంగతి సోమన్న దివాన్‌జీ సాహెబు వారికి తెలియజేశాడు.

అయిదు నెలలకే అంతపెద్ద బంగళా పూర్తి కావడం దివానుగారికి చాలా సంతోషం కలిగించింది.

ఆ మర్నాడే ఆయన బంగళాను చూడడంకోసం భీమునిపట్నం వచ్చారు.

సోమనాథం దివానుగారిని బంగళా నాలుగు మూలలకీ తీసుకునివెళ్ళి, తాను ఏవిధంగా ఏపని చేయించినదీ వివరించి చెప్పాడు.

దివానుగారు మనస్సులో చాలా సంతోషించినా, బయటికి ఏమీన్నీ ఉబకడం లేదు.

అమాంబాపతులు ఎంత అయిందీ ఆయన సోమన్నను అడగనూలేదు; సోమన్న తనంతట చెప్పడానికన్నా ఆయన అవకాశమూ యీయలేదు.

రెండు మూడు రోజుల్లో లెక్కలతో పాటు విజయనగరం రావలసిందంటూ ఆయన తాఖీదుమాత్రం యిచ్చాడు.

తన జీతంసంగతి యేమిన్నీ ఎత్తుకోనన్నా లేదు.

అది సోమన్నకి చాలా కష్టం అనిపించింది.

విజయనగరం వెళ్లినమీదట తన సంగతంతా మనవిచేద్దామని మనస్సులో నిశ్చయించుకున్నాడు.

దివానుగారు వెళ్లిపోయారు.

ఆయనముభావం సోమనాథానికే కాకుండా, అతనిమీద అభిమానం వున్న మరికొంతమందికి కూడా కష్టమని / అనిపించింది.

అప్పటికప్పుడే ఆ వూరిలో కొన్ని వదంతులు పుట్టి నాలుగు మూలలకీ అల్లుకున్నాయి.

సోమనాథం తగిన మర్యాదలు జరపడం లేదనీ, అందుకనే దివానుగారు ముభావంగా వున్నారనీ కొందరనుకున్నారు.

బంగళాపని ఆయనకు సుతరామూ నచ్చలేదనీ, అందుకోసమే తగిన సంజాయిషీ యివ్వడానికి విజయనగరం రావాలంటూ తాఖీదు చేశారనీ మరోపక్షంవారి అభిప్రాయం.

సోమనాథం చాలా డబ్బు కాజేశాడని దివానుగారి అనుమానమనీ, అందుకోసమే లెక్కలతో హాజరుకావాలని అన్నారనీ మరికొందరి ఊహాగానం.

ఇవన్నీ సోమనాథం చెవి సోకినాయి. అతని ధైర్యం కొంత సడలింది. మనస్సు పరిపరివిధాల పోయింది. ఏమి నిశ్చయించుకోడానికి సాధ్యం కాలేదు. ఇంతకూ తనకు రావలసిన జీతము రాదేమో అనే పెద్ద అనుమానం అతనిమనస్సులో ప్రవేశించింది.

తానూ, తన కుటుంబమూ మలమల మాడుతూ, ఎంతో విశ్వాసంతో పనిచేస్తే వచ్చిన ప్రతిఫలం యిదా? అంటూ మనస్సులో సోమనాథం క్రుంగిపోయాడు.

4

సోమనాథం జంకుతూ, జంకుతూ దివాంజీవారి కచేరీసావిట్లో ప్రవేశించాడు.

అక్కడ దివానుగారొక్కరే ఏవో కాగితాలు చూసుకుంటున్నారు.

సోమనాథాన్ని చూసి, అతను వణుకుతూ వున్న చేతులతో చేసిన నమస్కారాన్ని అందుకుని, కూచోమని సంజ్ఞచేశా రాయన.

కాని సోమనాథం కూర్చోకుండా నిలిచియే ఉండి, దివానుగారి నోటినుంచి ఏవా

ప్రమాదరక్షణకు

— పశస్తమైనది —

భీమా

ఎప్పుడే ప్రమాదం వచ్చేదీ, ఏక్షణం ఎలా ఉండేదీ తెలియని ఈదినాల్లో

అగ్ని * మోటార్‌కారు * కార్మిక నష్టపరిహారం

నౌకా * ఫయిడిలిటీ గ్యారంటి * మొదలైన భీమాలకు

మాతో సంప్రదించండి :

యునైటెడ్ ఇండియా ఫైర్ అండ్

జనరల్ ఇన్సురెన్సు కంపెనీ లిమిటెడ్,

"యునైటెడ్ ఇండియా లైఫ్ బిల్డింగ్సు"

ఎస్ప్లనేడ్ - మద్రాసు.

Telephone : 4241. Telegrams : "UNIGEN"

బ్రాంచీలు :

విజయవాడ - బెంగుళూరు - బొంబాయి - కలకత్తా

న్యూఢిల్లీ - పాట్న - హుబ్లి - కొలంబో - సింగపూరు.

శ్యాలు వెలువడతాయో వినడానికి సిద్ధంగా వున్నాడు.

దివానుగారు సోమనాథంవేపు నిదానించి చూశారు. ఇన్నాళ్లనుంచీ అతను పడుతూవుండిన శ్రమ అతనిలో మూర్తీభవించి వుంది; చాలా చిక్కిపోయాడు కూడాను.

అతని ముఖంమీద నిరాశ తాండవిస్తున్నాది.

దివాను జగన్నాథరాజుగారు సంగతంతా గ్రహించారు. ఇదివరకు కూడా ఇతరులవల్ల — సోమనాథం స్థితిగతులన్నీ విని వున్నారు.

'సోమనాథం! ఆ లెక్కలకాగితాలు యిలా ఇచ్చి నువ్వు ఆ బెంచీమీద కూచుని, కాస్త విశ్రాంతి తీసుకో.'

'చిత్తం, చిత్తం' అంటూ సోమన్న కాగితాలు అందించి, జంకుతూ బెంచీమీద కూలబడ్డాడు.

ఆ లెక్కలు చూసి దివానుగారాశ్చర్యపడ్డారు! ఏభయివేలపైచిలుకు ఖర్చు కాగలదనుకున్న బంగళా పాతికవేలతోటే తయారయినట్లు లెక్కలు స్పష్టంగా కనబడుతున్నాయి.

'సోమనాథం! బంగళా ఎంతలో కావాలని మొదట చెప్పివున్నామో జ్ఞాపకం వుందా?'

'చిత్తం, చిత్తం. యాభైవేలన్నట్లు గుర్తు.'

'అయితే యీ లెక్కలేమిటి? పిచ్చి బ్రాహ్మడా?'

అంటూ ఆయన ఆ కాగితాలన్నిటినీ పర్రుమని చింపివేశారు!

సోమనాథానికేమీ అర్థం కాలేదు.

'నువ్వు బంగళాను చాలా బాగా కట్టించినందుకు చాలా సంతోషిస్తున్నాం. యాభైవేలు ఖర్చుపెట్టినా, అలా ఎవ్వరూ కట్టించలేరు.'

'చిత్తం, చిత్తం. అది ఏలినవారి కటాక్షం.'

'నువ్వు చాదస్తపు బ్రాహ్మడవగుటచేత యిలా పిచ్చి పిచ్చిగా లెక్కలువేశావు. మరొకరైతే యాభైవేలకీ కిట్టించి వుందురు.'

సోమనాథం ఏమీ మాటలాడలేదు.

'నువ్వు ఒక దమ్మిడీ అయినా తీసుకోకుండా నానా కష్టాలూ పడి కాలం గడిపావు. మేము జీతం యేదైనా యేర్పాటు చేసివుంటామని భ్రాంతిపడివుంటావు. ఇలాంటివాటికి జీతం ఏర్పాటు పద్ధతిలో లేదు.'

సోమనాథం నిలువునా నీరయిపోయినాడు. దివాను ఏమి అంటున్నదీ అతనికి అర్థం కాలేదు.

'అయినా, నువ్వు నిరుత్సాహపడవద్దు. ఇలా పనిచేయించినందుకు నీకుతగిన ప్రతిఫలమే ముడుతుంది. యాభైవేల పనిని పాతికవేలలో ముగించి, సంస్థానంవారికి లాభం చూపించినందుకు నీకు అయిదువేలు కట్నంగా యిస్తున్నాము.'

సోమనాథం ఆనందం పట్టలేకపోయాడు.

'నిజమే? నిజమే?' అని అతనినోటినుంచి అప్రయత్నంగా రెండుమాటలు వెలువడ్డాయి.

'నిజమే! ఇందులో అబద్ధం యేమీ లేదు. నువ్వు కంట్రాక్టరువనుకో! నీకు యీ బంగళా కట్టించడానికి ముప్ఫయివేలకి గుత్తకిచ్చినామనుకో. నువ్వెంత ఖర్చుపెట్టినదీ మాకవసరంలేదు. మా కోరిన పని పసందుగా ఉండడమే మాకు కావాలి. నువ్వు పాతికవేలే ఖర్చుచేస్తే—ఆ మిగిలిన అయిదు వేలూ నీకు లాభం అన్నమాట!'

సోమనాథం ఏమో చెప్పబోయాడు.

'నువ్వు మరి మాటాడకు. నీవంటి చాదస్తుడిని నే నెక్కడా చూడలేదు. రేపుపొద్దున్న ముప్ఫయివేలకి లెక్కలు కిట్టించి రాసుకుని తీసుకురా. ముప్ఫయివేలకి నీకు కంట్రాక్టుకు యిచ్చినట్లు వ్రాసి ఉన్న యీ ఎగ్రిమెంటుమీద నువ్వు సంతకం చేస్తూ— నువ్వు పని ప్రారంభించిన తేదీ వెయ్యి. రేపుపొద్దున్న వచ్చి, ఆ కాగితాలు యిచ్చి అయిదువేలూ తీసుకొని వెళ్లు.'

సోమనాథం కృతజ్ఞతతో 'చిత్తం చిత్తం. ఇలా జరుగుతుందని కలలో కూడా అనుకోలేదండి ప్రభూ!' అని మనవి చేశాడు.

'ఇంతే కాదు. నీకు రేపటినుంచీ యింజనీరింగుడిపార్టుమెంటులో నెలకు నలభై రూపాయాలమీద వుద్యోగం యివ్వడానికి యేర్పాటు చేయబడింది.'

సోమనాథం ఆనందంతో ఆకాశం అందుకున్నాడు.

★



"జీవనప్రమాణాన్ని నిర్ణయించటానికి సునిసూత్రం ఏమన్నా ఉందా?"
"లేకేం? నీ ఆదాయాన్ని రెండెట్లు గుణించు."

* * * *

ట్రాముకారులో కూర్చోటానికి చోటులేక నిలబడివున్న ఒక ఒకయువతి తన స్నేహితురాలితో అన్నది: "ఆ అందమైన అబ్బాయి లేచి సీటు ఇస్తే బావుండును."

ఇది విని అయిదుగురు లేచినిలబడ్డారు.